

ఎంఎల్‌ఎ నాయకర్‌ను కలిసిన నేతలు

ప్రజాశక్తి - నరసాపురం

భారీ మెజారిటీతో గెలుపొంది నరసాపురం ఎంఎల్‌ఎగా ప్రమాణ స్వీకారం చేసిన బొమ్మిడి నాయకర్‌ని మంగళవారం వారి నివాసంలో రాష్ట్ర అగ్నికుల క్షత్రియ సంక్షేమ సంఘం ఆంధ్రప్రదేశ్ రాష్ట్ర వ్యవస్థాపక అధ్యక్షులు, జాతీయ బిసి సంక్షేమ సంఘం ఆంధ్రప్రదేశ్ రాష్ట్ర ప్రధాన కార్యదర్శి, ప్రముఖ సీనియర్ న్యాయవాది వనమాల శ్రీనివాస్ కలిసి అభినందనలు తెలిపారు. అనంతరం శాలువాతో సత్కరించి, జ్ఞాపిక అందజేశారు. ఈ సందర్భంగా శ్రీనివాస్ మాట్లాడుతూ నియోజకవర్గంలో వశిష్ఠ వారధి, ఫిషింగ్ హార్బర్, నల్లిక్రిక్ తదితర సమస్యలు అన్ని నాయకర్ పూర్తి చేస్తారని ఆశాభావం వ్యక్తం చేశారు. ఈ కార్యక్రమంలో తిరుమాని వెంకటరాజు పాల్గొన్నారు.



ఎంఎల్‌ఎను సత్కరిస్తున్న నేతలు

క్షేత్రస్థాయి పాలన పట్టాలెక్కేదెప్పుడో..!

బదిలీల కోసం మండలస్థాయి అధికారుల ఎదురుచూపు

ప్రజా సమస్యలపై నేతల సిఫార్సు మేరకే స్పందన



ప్రజాశక్తి - డెస్క్

సార్వత్రిక ఎన్నికల పర్వం ముగిసింది. కేంద్రంలోను, రాష్ట్రంలోను కొత్త ప్రభుత్వాలు కొలువుదీరాయి. రెండు జిల్లాలకు కొత్త కలెక్టర్లు నియమితులయ్యారు. అయినా పాలన పట్టాలెక్కేదెప్పుడోనని జనం ఎదురుచూడాల్సిన పరిస్థితి దాపురించింది.

మార్చి 16న ఎన్నికల షెడ్యూల్ విడుదల కావడంతో కోడ్ అమల్లోకి వచ్చి యంత్రాంగమంతా ఎన్నికల విధుల్లో నిమగ్నమయ్యారు. సాధారణంగా సాగే ప్రజా ఫిర్యాదుల స్వీకరణ సైతం నిలిచిపోయింది. ఎన్నికల ప్రక్రియ పూర్తయ్యి ఫలితాలు వెలువడిన అనంతరం జూన్ ఆరో తేదీన ఎన్నికల కోడ్ తొలగించారు. అంటే సుమారు రెండు నెలల 20 రోజులు కోడ్ అమలులో ఉండటంతో ప్రజా సమస్యలన్నీ ఎక్కడికక్కడ పేరుకుపోయాయి. కోడ్ తొలగి సుమారు 20 రోజులవుతున్నా ఇప్పటికీ పాలనా కార్యక్రమాలు పూర్వ స్థితికి చేరలేదు. గత ప్రభుత్వ విధానాల ఫలితంగా ఏర్పడిన ఇబ్బందుల నుంచి జనం ఉపశమనం కోరుకుంటున్నారు. ప్రధానంగా ధరా భారంతోపాటు చెత్త పన్ను ఇతర భారాల ఉపసంహరణ కోసం ఆశగా ఎదురుచూస్తున్నారు. వీటిపై ప్రభుత్వం విధానపర నిర్ణయాలు తీసుకుని అమలు చేస్తేగాని ప్రజానీకానికి ఉపశమనం దక్కే అవకాశం లేదు. ఈ క్రమంలో కొత్తగా ఎన్నికైన ప్రజాప్రతినిధులు ఇప్పుడిప్పుడే తమ కార్యకలాపాలను ముమ్మరం చేశారు. జనం సమస్యలను క్షుణ్ణంగా తెలుసుకునే ప్రయత్నం చేస్తున్నారు. ప్రాధాన్యతాక్రమంలో వాటిని పరిష్కరిస్తామని, ఆందోళన చెందొద్దంటూ భరోసా ఇస్తున్నారు. ఇంతవరకూ బాగానే ఉంది. కొత్త ప్రజాప్రతినిధులొచ్చారు.. కొత్త కలెక్టర్లు నియమితులయ్యారుగాని ఎన్నికల బదిలీల్లో భాగంగా ఏలూరు, పశ్చిమగోదావరి జిల్లాలకు వచ్చిన మండలస్థాయి అధికారులు ఇంకా అక్కడే విధుల్లో ఉన్నారు. వీరంతా తమ సొంత జిల్లాలకు ఎప్పుడెళ్తామా అనే మూడ్‌లో ఉన్నారు. ఈ క్రమంలో తమ సొంత జిల్లాల్లో తమకు అనువైన ప్రాంతాల్లో నియామక ఉత్తర్వులు పొందేందుకు ఆయా ప్రాంతాల ప్రజాప్రతినిధులు, నేతలను కలిసే పనిలో వీరంతా నిమగ్నమయ్యారు. ఎంఎల్‌ఎలు, జిల్లా అధికారులు తమ ప్రాంతాలకు వచ్చినప్పుడే వీరు ఎక్కువ అందుబాటులో ఉంటున్నారు. కొత్త ఎంఎల్‌ఎలు సైతం తమకు అనుకూలంగా ఉండే అధికారుల కోసం అన్వేషిస్తున్నట్లు సమాచారం. ఈ నేపథ్యంలో ప్రజాప్రతినిధులు, నేతలు సిఫార్సు చేసిన వినతులు, అంశాలపైనే అధికారులు స్పందిస్తున్నారు. క్షేత్రస్థాయిలో తాగునీరు, ఇతర అత్యవసర అంశాలపైనా ఉన్నతాధికారులతో సంప్రదించి అవసరమైన చర్యలు తీసుకుంటున్నారు. అంతేగాని రోజువారీ దైనందిన కార్యకలాపాలపై డివిజన్, మండలస్థాయి అధికార యంత్రాంగం పెద్దగా దృష్టి సారించడం లేదనే విమర్శలు విన్పిస్తున్నాయి. ఏలూరు జిల్లా కలెక్టర్ కె.వెట్రిసెల్వి బుధవారం బాధ్యతలు స్వీకరించబోతున్నారు. పశ్చిమగోదావరి జిల్లా కలెక్టర్ నాగరాణి కూడా రెండు రోజుల్లో బాధ్యతలు స్వీకరించే అవకాశం ఉంది. కలెక్టర్లు బాధ్యతలు స్వీకరిస్తే బదిలీల పర్వం ప్రారంభమవుతుందని తెలుస్తోంది. అదే జరిగి కొత్త అధికారుల నియామకం జరిగితే వారం, పది రోజుల్లో క్షేత్రస్థాయి అధికార యంత్రాంగం గాడిన పడే అవకాశం ఉంది. ప్రభుత్వ విధానపర నిర్ణయాలు, పథకాల మాట ఎలాగున్నా తాము రోజువారీ ఎదుర్కొంటున్న స్థానిక సమస్యలు కొన్నయినా పరిష్కారమవుతాయని జనం ఎదురుచూస్తున్నారు. ఆ దిశగా ప్రభుత్వం, ప్రజాప్రతినిధులు, జిల్లా అధికారులు త్వరిగతిన చర్యలు చేపట్టాలని అంతా కోరుతున్నారు.

మంత్రి నిమ్మలను కలిసిన కొత్త కలెక్టర్ నాగరాణి



జిల్లాకు చెందిన రాష్ట్ర జలవనరుల శాఖా మంత్రి నిమ్మల రామానాయుడును అమరావతిలోని రాష్ట్ర సచివాలయంలో జిల్లాకు కలెక్టర్‌గా నూతనంగా నియమితులైన చదలవాడ నాగరాణి మంగళవారం మర్యాదపూర్వకంగా కలిసి పుష్పగుచ్ఛం అందజేశారు. ఈ సందర్భంగా మంత్రి నిమ్మల రామానాయుడు మాట్లాడుతూ జిల్లాను అభివృద్ధి పథంలో నడిపేలా ముందుకు సాగాలని సూచించారు. పెండింగ్ పనులపై ప్రధానంగా దృష్టి సారించాలని, ప్రభుత్వ పథకాలకు ప్రజలకు చేరువ చేయాలని అన్నారు.

వ్యాధులపై అవగాహన కల్గి ఉండాలి

జిల్లా వైద్యాధికారి మహేశ్వరరావు

ప్రజాశక్తి - భీమవరం టౌన్

పుట్టుకతో వచ్చు లోపాలు, వ్యాధులపై ప్రతి వైద్యుడూ అవగాహన కల్గి ఉండాలని జిల్లా వైద్యాధికారి డి.మహేశ్వరరావు సూచించారు. మంగళవారం రాష్ట్రీయ బాల స్వాస్థ్య కార్యక్రమంలో భాగంగా ఇండియన్ మెడికల్ అసోసియేషన్ హాల్లో వైద్యులు, స్టాఫ్‌నర్స్, ఎఎన్‌ఎంలకు శిక్షణ నిర్వహించారు. ఈ సందర్భంగా మహేశ్వరరావు మాట్లాడుతూ ప్రతిఒక్క వైద్యాధికారి పుట్టుకతో వచ్చే లోపాలు, పుట్టుకతో వచ్చే అంగవైకల్యం, అభివృద్ధి లోపాలు, పోషకాహారం వల్ల వచ్చే లోపాలు గురించి అవగాహన కలిగి ఉండాలన్నారు. గ్రామాల్లోని ఎఎన్‌ఎంలు, ఆశా వర్కర్లు తమ పరిధిలో ఐదు సంవత్సరాల్లోపు చిన్నారులతోపాటు స్కూలుకు వెళ్లే విద్యార్థుల లోపాలను నిశితంగా పరిశీలించాలన్నారు. వారిలో వచ్చే మార్పులను గుర్తించి స్థానికంగా ఉన్న పిహెచ్‌సి వైద్యులకు చూపించి తగు వైద్యం చేయించాలన్నారు. వ్యాధి తీవ్రమైతే అదనపు సౌకర్యాలు కలిగిన ఆసుపత్రికి పంపించాలని ఆయన సూచించారు. ప్రత్యేక అవసరా గల పిల్లలను పిల్లల స్పెషలిస్టులకు చూపించి మెరుగైన వైద్యం అందేలా చూడాలన్నారు. ఈ కార్యక్రమంలో ఆర్‌బిఎస్‌కె ప్రోగ్రాం ఆఫీసర్ డాక్టర్ జి.భావన, డిస్ట్రిక్ట్ మెడికల్ ఆఫీసర్ డాక్టర్ వై.వెంకటేశ్వరరావు, వైద్యులు పాల్గొన్నారు.

కల్లుగీత వృత్తిని ఆధునికీకరించాలి

కల్లుగీత కార్మిక సంఘం రాష్ట్ర ప్రధాన కార్యదర్శి జుత్తిగ నరసింహామూర్తి

ప్రజాశక్తి - భీమవరం టౌన్

పెరుగుతున్న టెక్నాలజీకి అనుగుణంగా కల్లుగీత వృత్తిని ఆధునికీకరించి, అభివృద్ధి చేసి, లక్షలాది గీతకార్మిక కుటుంబాలను ఆదుకోవాలని ఎపి కల్లుగీత కార్మిక సంఘం రాష్ట్ర ప్రధాన కార్యదర్శి జుత్తిగ నరసింహామూర్తి నూతన ప్రభుత్వానికి విజ్ఞప్తి చేశారు. మంగళవారం గీత కార్మికుల భీమవరం డివిజన్ (ఆరు మండలాలు) విస్తృత సమావేశం స్థానిక సిఐటియు కార్యాలయంలో సంఘం జిల్లా ఉపాధ్యక్షులు కడలి పాండు అధ్యక్షతన జరిగింది. ముఖ్యఅతిథి జుత్తిగ నరసింహామూర్తి మాట్లాడుతూ కల్లుగీత వృత్తి పట్ల అవగాహన లేని గత వైసిపి ప్రభుత్వం మద్యాన్ని ఆదాయ వనరుగా చూస్తూ గీత వృత్తిని దెబ్బతీసిందన్నారు. కష్టపడి వృత్తి చేసుకునే వారిపై అక్రమ కేసులు పెట్టారని ఆవేదన వ్యక్తం చేశారు. కొత్తగా అధికారంలోకి వచ్చిన ప్రభుత్వంపై గీత కార్మికులు ఎన్నో ఆశలు పెట్టుకున్నారని తెలిపారు. తాటి చెట్టుకు రూ.పది చొప్పున పన్ను కట్టించుకుని చెట్టుపై హక్కు కల్పించాలని కోరారు. కల్లును శీతల పానీయంగా అభివృద్ధి చేయాలని, నిడదవోలులోని తాటిబెల్లం ఫెడరేషన్‌కు నిధులు కేటాయించి తాటి బెల్లానికి మార్కెట్ కల్పించాలని విజ్ఞప్తి చేశారు. గీత వృత్తి ఆధునికీకరణకు నిపుణుల కమిటీ వేయాలని డిమాండ్ చేశారు. సమావేశంలో కొండవీటి శ్రీనివాసరావు, కాగిత రాధాకృష్ణ, తుంగ సాయిబాబు, చింతపల్లి చినవీరాస్వామి, కోమటి సత్యనారాయణ, వంక సత్యనారాయణ పాల్గొన్నారు.



మాట్లాడుతున్న నరసిమహామూర్తి

ప్రత్యామ్నాయ రైళ్లు నడపాలని వినతి

ప్రజాశక్తి - భీమవరం టౌన్

రద్దయిన రైళ్ల స్థానంలో ప్రత్యామ్నాయ రైళ్లు నడపాలని భీమవరం హౌసింగ్ బోర్డు కాలనీ డెవలప్‌మెంట్ కమిటీ, లయన్స్‌క్లబ్, శ్రీ విజ్ఞానవేదిక, సిపిఎం, సిపిఐ ఆధ్వర్యంలో భీమవరం జంక్షన్ రైల్వేస్టేషన్ సూపరింటెండెంట్ చక్రవర్తికి మంగళవారం వినతిపత్రం అందజేశారు. రైల్వే డిఆర్‌ఎంకు ఫ్యాక్స్ ద్వారా వినతిపత్రం పంపారు. ఈ సందర్భంగా హౌసింగ్ బోర్డు డెవలప్‌మెంట్ కమిటీ అధ్యక్షులు సరిపిడకల రామారావు, కార్యదర్శి ముదునూరి సూర్యనారాయణరాజు మాట్లాడుతూ రైల్వే పనులపై దృష్టి సారించి రైల్వే శాఖ త్వరితగతిన నిర్మాణ పనులు చేపట్టడం సంతోషదాయకమన్నారు. అయితే ఈ పనుల పేరుతో రైళ్లు రద్దు చేయడంతో ప్రయాణికులు తీవ్ర ఇబ్బందులు పడుతున్నారన్నారు. రైల్వే అధికారులు స్పందించి ప్రయాణికుల ఇబ్బందులు తొలగించేలా ప్రత్యామ్నాయ రైళ్లు నడపాలని కోరారు. సిపిఎం నాయకులు ఎం.వైకుంఠరావు, చెల్లబోయిన వెంకటేశ్వరరావు, సిపిఐ నేత ఎం.సీతారాంప్రసాద్ మాట్లాడుతూ రైల్వే అధికారులు ప్రయాణికుల ఇబ్బందులను సానుకూల దృక్పథంలో పరిశీలించి పరిష్కరించాలన్నారు. లయన్స్ క్లబ్ అధ్యక్ష కార్యదర్శులు కంతేటి వెంకటరాజు, కుక్కల బాల, కడలి వెంకటేశ్వరరావు, జనపాటి మధు, శ్రీ విజ్ఞానవేదిక కన్వీనర్ చెరుకువాడ రంగసాయి మాట్లాడుతూ హైదరాబాద్‌లోని దక్షిణమధ్య రైల్వే జిఎంకు, విజయవాడ డిఆర్‌ఎంకు వినతిపత్రాలు పంపినట్లు తెలిపారు. కార్యక్రమంలో లయన్స్ క్లబ్ పట్టణ ఉపాధ్యక్షులు నరహరిశెట్టి కృష్ణ, ఫణి తదితరులు పాల్గొన్నారు.



కట్టడానికి నోటీసులు అంటిస్తున్న సిబ్బంది

వైసిపి జిల్లా కార్యాలయానికి నోటీసులు

ప్రజాశక్తి - ఉండి

ఉండి మండలం ఎన్‌ఆర్‌పి అగ్రహారం పంచాయతీ పరిధిలో నిబంధనలకు విరుద్ధంగా నిర్మిస్తున్న వైసిపి జిల్లా కార్యాలయానికి పంచాయతీ సిబ్బంది మంగళవారం నోటీసులు అంటించారు. ఈ సందర్భంగా గ్రామ పంచాయతీ కార్యదర్శి జడ్డు వెంకట తాతనాయుడు మాట్లాడుతూ గృహనిర్మాణ సంస్థకు చెందిన 72 సెంట్ల భూమిలో నిర్మిస్తున్న వైసిపి జిల్లా కార్యాలయానికి గ్రామ పంచాయతీ నుంచి ఎటువంటి అనుమతులు ఇవ్వలేదన్నారు. ఏడు రోజుల్లో నిబంధనలకు అనుగుణంగా అనుమతులు పొందాలని, లేనిపక్షంలో నిర్మాణంలో ఉన్న భవనాన్ని కూల్చివేస్తామని స్పష్టం చేశారు. కూల్చివేతకు అయ్యే ఖర్చును కూడా వైసిపి జిల్లా అధ్యక్షులు చెరుకువాడ శ్రీరంగనాథరాజు నుంచి వసూలు చేస్తామని ఆ నోటీసులో పేర్కొన్నారు. నోటీసులు అందుకోవడానికి ఎవరూ ముందుకు రాకపోవడంతో కార్యాలయ భవనానికి నోటీసులు అంటించామని తెలిపారు. కార్యక్రమంలో గ్రామ రెవెన్యూ అధికారి టి.గోవిందరాజులు, సిబ్బంది పాల్గొన్నారు.

ఉపాధి కూలీల బకాయిలు విడుదల చేయాలి: వ్యకాస

ప్రజాశక్తి - తాడేపల్లిగూడెం రూరల్

మండలంలో ఉపాధి హామీ బకాయిలు వెంటనే విడుదల చేయాలని ఎపి వ్యవసాయ కార్మిక సంఘం నాయకులు కండెల్లి సోమరాజు డిమాండ్ చేశారు. నందమూరులోని ఉపాధి కూలీలు పని చేస్తున్న ప్రదేశాల్లో సోమరాజు, చిర్ల పుల్లారెడ్డి మంగళవారం పర్యటించి కూలీల సమస్యలు అడిగి తెలుసుకున్నారు. ఉపాధి కూలీలకు గత ఆరు వారాల నుండి మండలంలోని అన్ని గ్రామాల్లోను డబ్బులు రాక అనేక ఇబ్బందులు ఎదుర్కొంటున్నారని సోమరాజు తెలిపారు. తక్షణమే కూలీలకు బకాయిలు విడుదల చేయాలని ప్రభుత్వాన్ని డిమాండ్ చేశారు. కూలీలకు పూర్తిస్థాయిలో పనులు చూపాలని కోరారు. కార్యక్రమంలో దొడ్ల అమ్మాజీ, చిన్నం జలదక్షి, రక్తం కనకమహాలక్ష్మి, ఆనంద్, కట్టా దేవి, మునుకోటి అన్నవరం, అడపా కుమారి, పోచమ్మ పాల్గొన్నారు.



మాట్లాడుతున్న సోమరాజు

పిహెచ్‌సిలో ఖాళీ పోస్టులను భర్తీ చేయాలి

సిపిఎం గ్రామ కమిటీ ఆధ్వర్యాన వినతి

ప్రజాశక్తి - తణుకు

వేల్పూరు ప్రాథమిక ఆరోగ్య కేంద్రంలో ఖాళీగా ఉన్న పోస్టులను వెంటనే భర్తీ చేయాలని సిపిఎం గ్రామ కమిటీ ప్రభుత్వాన్ని డిమాండ్ చేసింది. మంగళవారం సిపిఎం గ్రామ కమిటీ ఆధ్వర్యంలో ప్రాథమిక ఆరోగ్య కేంద్రం డాక్టర్ కె.సాయిభవానికి వినతిపత్రాన్ని అందజేశారు. ఈ సందర్భంగా సిపిఎం గ్రామ కార్యదర్శి బళ్ల చినవీరభద్రరావు మాట్లాడుతూ తణుకు రూరల్ మండలంలో ఉన్న 9 గ్రామాల ప్రజలకు వేల్పూరు గ్రామంలో ఉన్న ప్రాథమిక ఆరోగ్య కేంద్రం అనేక వైద్య సేవలు అందిస్తుందన్నారు. అయితే ముఖ్యంగా రోగులకు అవసరమైన రక్త పరీక్షలు చేసేందుకు ల్యాబ్ టెక్నీషియన్, ఎఫ్‌ఎన్‌ఒ, నైట్ వాచ్‌మెన్ వంటి వారు లేకపోవడం వల్ల రోగులకు పూర్తి స్థాయిలో వైద్య సేవలు అందుబాటులో లేక ఇబ్బందులకు గురౌతున్నారన్నారు. గతంలో ఈ ఆసుపత్రి ద్వారా వైద్య సిబ్బంది అందించిన వైద్య సేవలను గుర్తించి ఆనాటి కేంద్ర ప్రభుత్వం దేశంలో అత్యుత్తమ పిహెచ్‌సిగా గుర్తించి అవార్డు అందించినట్లు ఆయన గుర్తు చేశారు. అటువంటి గుర్తింపు పొందిన పిహెచ్‌సికి వచ్చిన రోగులకు ప్రస్తుతం రక్త పరీక్షలు చేయడానికి ల్యాబ్ టెక్నీషియన్ లేక, గత రెండేళ్లుగా ఇక్కడ నియమించిన ఇన్‌ఛార్జి వారంలో కేవలం రెండు రోజులు మాత్రమే విధులు నిర్వహిస్తుండటం వల్ల, మిగతా రోజుల్లో పిహెచ్‌సికి వచ్చిన రోగులకు రక్త పరీక్షలు చేయకపోవడంతో రోగులు ప్రయివేట్ ల్యాబ్‌లను ఆశ్రయించవలసి వస్తుందని వీరభద్రరావు వాపోయారు. ఇప్పటికైనా సంబంధిత అధికారులు స్పందించి ప్రాథమిక ఆరోగ్య కేంద్రంలో ఖాళీగా ఉన్న పోస్టులను తక్షణం భర్తీ చేసి రోగులకు ఇబ్బంది లేకుండా వైద్య సేవలు అందించాలని ప్రభుత్వాన్ని డిమాండ్ చేశారు. ఈ కార్యక్రమంలో వాసా వెంకటేశ్వరరావు, తిరునాథం వెంకటేశ్వరరావు, అంబటి రామకృష్ణ, కుడక వీరభద్రరావు, సోరపల్లి రామకృష్ణ, జల్దాని సత్యనారాయణ పాల్గొన్నారు.



పిహెచ్‌సి వైద్యులు సాయిభవానికి వినతిని అందజేస్తున్న సిపిఎం నాయకులు

భీమవరంలో కల్కి సందడి షురూ

భీమవరం టౌన్: ప్రభాస్ హీరోగా నటించిన కల్కి సినిమా సందడి భీమవరంలో షురూ అయ్యింది. ఈ నెల 27న విడుదలవుతున్న కల్కి సినిమాకు సంబంధించి అభిమానులు ఇప్పటికే భారీస్థాయిలో ఫ్లెక్సీలు, కటౌట్లు ఏర్పాటు చేశారు. మంగళవారం భీమవరంలోని యూత్ క్లబ్ రోడ్డులో అభిమానులు 17 కార్లతో కల్కి (ఇంగ్లీష్ అక్షరాలు) రూపంలో ఏర్పాటు చేసి అందర్నీ ఆకట్టుకున్నారు. ఈ సందర్భంగా నిర్వహించిన కార్ల ర్యాలీతో పట్టణంలో సందడి వాతావరణం నెలకొంది.

జగన్ హయాంలో రైతుల బాధలు వర్ణనాతీతం

ఎంఎల్‌ఎ ఆరిమిల్లి రాధాకృష్ణ



ప్రజాశక్తి - తణుకు

జగన్ ఐదేళ్ల పరిపాలనలో ఆకుమడి దగ్గర నుంచి కోతల సమయం వరకు రైతుల బాధలు వర్ణణాతీతమని తణుకు నియోజకవర్గ ఎంఎల్‌ఎ ఆరిమిల్లి రాధాకృష్ణ అన్నారు. మంగళవారం తణుకు ఉమ్మడి పార్టీ కార్యాలయం వద్ద విలేకరుల సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా రాధాకృష్ణ మాట్లాడుతూ రైతులు ధాన్యం ఎక్కడ అమ్ముకోవాలో కూడా తెలియని పరిస్థితి ఉండేదన్నారు. ఎరువులకు సరైన పంపిణీ వ్యవస్థ ఉండేది కాదన్నారు. సొసైటీలను నిర్వీర్యం చేశారని, కాలువలు నిర్వహణ లేక, సరైన సమయంలో నీరు అందక గత ఐదేళ్లలో రైతాంగం పూర్తిగా నష్టపోయిందన్నారు. గత మంత్రి కారుమూరి కనీసం ధాన్యం సేకరణ కూడా చేయించలేని పరిస్థితి ఉండేదని తెలిపారు. గోను సంచుల్లో పెద్ద ఎత్తున దోపిడీకి తెరలేపారని, ధాన్యాన్ని, బియ్యాన్ని ఇతర రాష్ట్రాలకు పంపిణీ చేసి అనేక స్కాంలు చేశారన్నారు. సివిల్ సప్లయ్ మంత్రిగా ఉన్న కారుమూరి కోట్లు దోచుకున్నారని మండిపడ్డారు. 2014 నుంచి 2019 వరకు సరైన సమయంలో నీరు అందించి రైతులకు నష్టం లేకుండా చూసుకున్న పరిస్థితి ఉండేదని మళ్లీ అలాంటి పరిస్థితి తీసుకొచ్చి రైతులను పూర్తిగా ఆదుకుంటామన్నారు. ధాన్యం సేకరణకు సంబంధించిన బిల్లులు ఇంకా అందలేదని, రానున్న రెండు వారాల్లో వాటికీ పరిష్కారం చూపే విధంగా త్వరలోనే ధాన్యం డబ్బును చెల్లించే బాధ్యత ప్రభుత్వం తీసుకుంటుందన్నారు. తణుకు నియోజకవర్గంలో దాళ్వా పంటకు సంబంధించి మొత్తంగా 14,912 మంది రైతులకు సంబంధించి 1,23,899 మెట్రిక్ టన్నుల ధాన్యాన్ని సేకరించడం జరిగిందన్నారు. రూ.270 కోట్లు ధాన్యం బిల్లులు రావాల్సి ఉండగా ఇప్పటికి రూ.85 కోట్లు రావడం జరిగిందని, మిగిలిన రూ.184 కోట్లు బిల్లులు త్వరలోనే రైతాంగానికి చెల్లించే విధంగా చర్యలు తీసుకుంటామని తెలిపారు. ఈ కర్యాక్రమంలో టిడిపి పశ్చిమగోదావరి జిల్లా ఉపాధ్యక్షులు బసవ రామకృష్ణ, బిజెపి నాయకులు అయినంపూడి శ్రీదేవి, టిడిపి పట్టణ అధ్యక్షులు కలగర వెంకటకృష్ణ, జనసేన పట్టణ అధ్యక్షులు కొమ్మిరెడ్డి శ్రీనివాస్, టిడిపి తణుకు మండల అధ్యక్షులు పితాని మోహన్, టిడిపి పట్టణ ప్రధాన కార్యదర్శి ఒమ్మి రాంబాబు, నాయకులు, కార్యకర్తలు పాల్గొన్నారు.

గ్రామాలను ఆరోగ్యంగా ఉంచుదాం

ఎంపిపి వీరవల్లి దుర్గాభవాని

ప్రజాశక్తి - వీరవాసరం

అందరి సహకారంతో గ్రామాల పారిశుద్ధ్యంపై ప్రత్యేశ్రద్ధ వహించి, సీజనల్ వ్యాధులు ప్రబలకుండా గ్రామాలను ఆరోగ్యంగా ఉంచడానికి ప్రయత్నిద్దామని ఎంపిపి వీరవల్లి దుర్గాభవాణి అన్నారు. పారిశుధ్యం, తాగునీరు సమీక్ష సమావేశాన్ని ఎంపిడిఒ విజయసారధి ఆధ్వర్యంలో మండల పరిషత్ కార్యలయంలో మంగళవారం నిర్వహించారు. పంచాయతీ కార్యదర్శులు, ఎఎన్ఎం, ఇరిగేషన్ సిబ్బంది పాల్గొన్న ఈ సమావేశంలో అపరిశుధ్య పరిస్థితుల నిర్మూలన, పరిశుభ్రమైన తాగునీరు సరఫరా వంటి అంశాలపై సుదర్ఘీ చర్చ నిర్వహించారు. ఈ సమీక్షకు ముఖ్య అతిథిగా పాల్గొన్న జెడ్‌పిటిసి గుండా జయప్రకాష్ నాయుడు మాట్లాడుతూ స్వచ్ఛ అవసరాలకు ఏ అవసరం వచ్చినా అన్ని విధాలుగా సహకరిస్తామన్నారు. మనందరం ప్రజల కోసం పని చేద్దాం.. ఈ క్రమంలో ఇబ్బందికర పరిస్థితులు కొని తెచ్చుకోవద్దన్నారు. ఈ సందర్భంగా ఎంపిడిఒ మాట్లాడుతూ పంచాయతీల్లో పారిశుధ్యం పర్యవేక్షణ ఇంజనీరింగ్ అసిస్టెంట్‌లదేనన్నారు. పంచాయతీ కార్యదర్శులు ప్రతిరోజు పారిశుధ్యంపై ప్రత్యేక దృష్టి పెట్టాలని తెలిపారు. ఆక్వాసాగు కలుషిత నీరు నేరుగా తాగునీటి చెరువుల్లోకి రావడంతో తాగునీరు కలుషితమవుతుందన్నారు. దీని నియంత్రణకు ఇరిగేషన్ శాఖ దృష్టి పెట్టి వీరవాసరం మండలంలో కాలువలలోకి వదిలిపెట్టే ఆక్వా చెరువులను గుర్తించాలని తెలిపారు. దీంతో ఇరిగేషన్ ఎఇ సత్యనారాయణ మాట్లాడుతూ కొన్ని గ్రామాల్లో కాలువ గట్లులను చెత్త డంపింగ్‌గా ఉపయోగించుకుంటున్నారని, దీనిని అరికట్టడానికి పంచాయతీలు చర్యలు తీసుకోవాల్సి ఉందన్నారు. త్వరలోనే ఒక కార్యాచరణను రూపొందించుకుని అపారిశుధ్య పరిస్థితుల నిర్మూలను ప్రజలను భాగస్వామ్యం చేసి వారికి అవగాహన కలిగించేందుకు సమావేశంలో నిర్ణయించారు. ఈ సమావేశంలో కొణితివాడ, వీరవాసరం పిహెచ్‌సి వైద్యులు నవనీత్, పి.సత్యనారాయణలు పాల్గొన్నారు.



సమావేశంలో మాట్లాడుతున్న ఎంపిపి దుర్గాభవాని

నారాయణ పాఠశాల విద్యాసామగ్రి సీజ్

ఎస్‌ఎఫ్‌ఐ ఆందోళన ఫలితంగా విద్యాశాఖ చర్యలు


ప్రజాశక్తి - ఆకివీడు

పట్టణంలోని నారాయణ విద్యాసంస్థలో విద్యాహక్కు చట్టానికి, ప్రభుత్వ నిబంధనలకు తూట్లు పొడుస్తూ యధేచ్ఛగా విద్యా వ్యాపారం జరుగుతోందని ఎస్‌ఎఫ్‌ఐ జిల్లా కార్యదర్శి ప్రసాద్ ఆరోపించారు. ఈమేరకు సోమవారం ఆందోళన చేపట్టారు. దీంతో స్థానిక నారాయణ పాఠశాల విద్యాసామగ్రి గదికి విద్యాశాఖ అధికారులు సీలు వేసి సామగ్రి సీజ్ చేస్తామని ప్రకటించారు. ఎస్‌ఎఫ్‌ఐ ఆధ్వర్యంలో పాఠశాల వద్ద చేపట్టిన ఆందోళన ఫలితంగా అధికారులు చర్యలు తీసుకున్నారు. ఈ సందర్భంగా ఎస్‌ఎఫ్‌ఐ జిల్లా కార్యదర్శి ప్రసాద్ మాట్లాడుతూ స్థానిక నారాయణ విద్యాసంస్థల్లో విద్యా సామాగ్రిని రూ.7 వేల నుంచి 15 వేల వరకు భారీగా అధిక ధరలకు విక్రయిస్తున్నారని అన్నారు. ఈ విషయం అనేకసార్లు విద్యాశాఖ అధికారుల దృష్టికి తీసుకెళ్లినా పట్టించుకోలేదని ఆరోపించారు. సోమవారం చేపట్టిన ఆందోళన ఫలితంగా మండల విద్యాశాఖ అధికారి ఎం.సీతారామయ్య అక్కడకు చేరుకొని పాఠశాల సిబ్బందిని హెచ్చరించి విద్యాసామాగ్రిని సీజ్ చేశారు. విద్యాసామగ్రి ఉన్న గది తాళంచెవులు లేవని సిబ్బంది చెప్పడంతో తాత్కాలికంగా ఎంఈఒ ఆ గదికి మరొక కొత్త తాళం వేసి సీలు వేశారు. సిబ్బంది ఆ తాళం తెచ్చిన వెంటనే సామగ్రి తీసుకువెళతామని చెప్పారు. ఈ సందర్భంగా ప్రసాద్ ఇప్పటికైనా అధికారులు మొద్దు నిద్ర వీడి విద్యాసంస్థల్లో పర్యటించి విద్యా వ్యాపారాన్ని ఆపాలని ఆయన డిమాండ్ చేశారు.

మహిళలకు మరుగుదొడ్లు ఏర్పాటు చేయాలని వినతి

ప్రజాశక్తి - ఆచంట

కొడమంచిలి సంత మార్కెట్ సమీపంలో గత టిడిపి హయంలో నిర్మించిన సిఎస్‌ఎల్‌ను గత వైసిపి ప్రభుత్వం కమ్యూనిటీ హాల్ నిర్మాణం పేరుతో తొలగించడంతో మరుగుదొడ్లు ఏర్పాటు చేయాలని మహిళలు వినతిని అందించారు. మంగళవారం కొడమంచిలి పెద్ద పేట గ్రామానికి చెందిన పలువురు మహిళలు ఇంటి వద్ద బాత్రూంలు లేకపోవడంతో వారి సమస్యను టిడిపి కూటమి నాయకులకు వెళ్లిబుచ్చుకున్నారు. ఈ నేపథ్యంలో ఆ గ్రామ మహిళలు కూటమి నాయకులు యధాస్థానంలో సిఎస్ఎల్ నిర్మాణం చేపట్టాలని పంచాయతీ కార్యదర్శి డి.నానికి వినతి పత్రం అందజేశారు. ఈ సందర్భంగా టిడిపి గ్రామ కమిటీ అధ్యక్షులు బాలం వెంకటరమణ మాట్లాడుతూ గత 15 సంవత్సరాల క్రితం టిడిపి గ్రామ సర్పంచి చిలుకూరి అబ్బూరావు పెద్ద పేట గ్రామస్తులకు పంచాయతీ తీర్మానం చేసి 23 సిఎస్ఎల్‌ను నిర్మించారన్నారు. అప్పటి నుంచి పెద్ద పేట గ్రామ మహిళలు వాటిని వినియోగించుకునేవారని తెలిపారు. ఈ తరహాలో వైసిపి ప్రభుత్వంలో ఆ ప్రాంతంలో కమ్యూనిటీ హాల్ నిర్మాణంకు ఆ మరుగుదొడ్లను తొలగించారన్నారు. ఆ గ్రామంలో కొంతమంది మహిళలు మరుగుదొడ్లు లేకపోవడంతో బహిర్భూమికి వెళ్లవలసిన పరిస్థితి నెలకొందని ఆ మహిళలు టిడిపి నాయకుల వద్ద వాపోయారు. తమకు తక్షణమే మరుగుదొడ్లు నిర్మించాలని వారిని కోరారు. ఈ విషయంపై పంచాయతీ కార్యదర్శి డి.నానిని వివరణ కోరగా టిడిపి కూటమి నాయకులు పెద్ద పేట గ్రామానికి చెందిన మహిళల సమస్యలపై వినతి పత్రం అందజేశారని, దీనిని ఉన్నతాధికారులకు అందజేస్తానని ఆయన తెలిపారు. ఈ కార్యక్రమంలో కూటమి నేతలు నెక్కంటి రామకృష్ణ, చిలుకూరి శ్రీను, కుసుమ నరసింహమూర్తి, కోట సతీష్ బాబు, మన్నె తేజ, జీవన్ కిరణ్, ఎల్లమెల్లి సురేష్, కుసుమ వెంకట్రావు, సరిళ్ల నాగరాజు, కప్పల వెంకట్రావు, దొంగ సత్తిబాబు పాల్గొన్నారు.



పంచాయతీ కార్యదర్శికి వినతిని అందజేస్తున్న గ్రామ మహిళలు

పెన్షన్ పెంపుపై పలువురు హర్షం

పెనుమంట్ర : వచ్చే జులై 1వ తేదీ నుంచి ఎన్‌టిఆర్ భరోసా పెన్షన్ పెంపుపై ముఖ్యమంత్రి నారా చంద్రబాబు నాయుడు మంత్రివర్గంలో తీసుకున్న నిర్ణయం హర్షణీయమని టిడిపి మండల అధ్యక్షులు సానబోయిన శ్రీనివాస్ అన్నారు. మాజీ ఎఎంసి చైర్మన్ సానబోయిన గోపాలకృష్ణ ఆచంట నియోజకవర్గం తెలుగు రైతు నాయకులు వెలగల బుల్లిరామిరెడ్డి, నెగ్గిపూడి టిడిపి నాయకులు, పంచాయతీ సభ్యులు కొప్పాడి సీతా నాగలక్ష్మి తమ హర్షం వ్యక్తం చేశారు. పెన్షన్ మొత్తం మూడు వేల నుంచి నాలుగు వేలకు పెంచడంతో పాటు, గడచిన ఏప్రిల్, మే, జూన్ నెల బకాయిలు రూ.3 వేలు కలిపి ఒక్కొక్క పెన్షన్ దారునికి మొత్తం రూ.7 వేలు వారి ఇంటివద్ద అందించాలన్న నిర్ణయానికి గాను వారు హర్షం తెలిపారు.

ఆసుపత్రిని పరిశుభ్రంగా ఉంచండి

టిడిపి మండల అధ్యక్షులు ఇందుకూరి రామకృష్ణంరాజు

గణపవరం: మండలంలోని పిప్పర ప్రాథమిక ఆసుపత్రి ఆవరణలో పిచ్చి మొక్కలతో అధ్వాన్నంగా తయారవడంతో మంగళవారం టిడిపి మండల కమిటీ అధ్యక్షులు ఇందుకూరి రామకృష్ణంరాజు ఆధ్వర్యంలో టిడిపి కార్యకర్తలు ఆసుపత్రి ఆవరణ అంతా పిచ్చి మొక్కలు తొలగించి పరిశుభ్రం చేశారు. ఈ సందర్భంగా రామకృష్ణంరాజు మాట్లాడుతూ రోగులకు సేవలందించే ప్రభుత్వ ఆసుపత్రి పరిశుభ్రంగా ఉండాలని అన్నారు. ఆసుపత్రి ఆవరణలో పిచ్చి మొక్కలతో అధ్వాన్నంగా మారడం పట్ల ఆయన అసహనాన్ని వ్యక్తం చేశారు. ఈ కార్యక్రమంలో టిడిపి కార్యకర్తలు పాల్గొన్నారు.

అత్యాచార నిందితులను కఠినంగా శిక్షించాలి

జాతీయ చేతివృత్తుల ఐక్యవేదిక జిల్లా అధ్యక్షులు అల్లాడ

పెనుమంట్ర : ఈస్టురుపాలెంలోని చేనేత కుటుంబానికి చెందిన పముజుల సుచరితను అత్యాచారం చేసి హత్య చేసిన హంతకులను కఠినంగా శిక్షించాలని జాతీయ చేతివృత్తుల ఐక్యవేదిక జిల్లా అధ్యక్షులు అల్లాడ సూర్య భాస్కరరావు డిమాండ్ చేశారు. మంగళవారం ఆయన విలేకరులతో మాట్లాడుతూ ఈస్టురుపాలెంలో అమానుషానికి గురైన చేనేత యువతి నిందితులను కఠినంగా శిక్షించాలని, బాధిత కుటుంబానికి ప్రభుత్వ ఉద్యోగం ఇప్పించి, ఆదుకోవాలని ప్రభుత్వాన్ని కోరారు. ఈ సందర్భంగా సుచరితకు నివాళులు అర్పించారు. ఈ ఘటనకు పాల్పడిన వారిపై కఠినమైన చర్యలు తీసుకొని, వెంటనే శిక్షించవలసిందిగా ప్రభుత్వాన్ని కోరారు. మహిళల రక్షణ కోసం ప్రభుత్వం సరైన ప్రణాళికతో ముందుకెళ్లి, ఆడపడుచులకు భద్రత కల్పించాలని ప్రభుత్వాన్ని కోరుతున్నామని అల్లాడ పేర్కొన్నారు.

అన్న క్యాంటీన్‌లో అన్నదానం

తాడేపల్లిగూడెం: స్థానిక తాలూకా ఆఫీస్ సెంటర్ వద్ద అన్న కేంటిన్‌లో 87వ మంగళవారం అన్నదాన కార్యక్రమం నిర్వహించారు. తాడేపల్లిగూడెం నియోజకవర్గ ఇన్‌ఛార్జి వలవల మల్లికార్జున రావు(బాబ్జి) ఆధ్వర్యంలో కొమ్ముగూడెం గ్రామానికి చెందిన టిడిపి అభిమాని పొన్నాడ శ్రీనివాస్ కుమారుడు హేమంత్ పుట్టినరోజు సందర్భంగా ఆర్థిక సహకారంతో అన్నదాన కార్యక్రమం నిర్వహించారు. ఈ కార్యక్రమంలో తాడేపల్లిగూడెం నియోజకవర్గ టిడిపి నాయకులు పాల్గొన్నారు.

శాసనసభ వ్యవహారాలపై అవగాహన

నరసాపురం: ఉప ముఖ్యమంత్రి పవన్ కళ్యాణ్ అధ్యక్షతన మంగళవారం ఆయన క్యాంప్ కార్యాలయంలో జనసేన ఎంఎల్‌ఏలకు శాసనసభ వ్యవహారాలపై అవగాహనా కార్యక్రమం నిర్వహించారు. ఈ సందర్భంగా నియోజకవర్గాల వారీగా సమస్యలపై చర్చించారు. నరసాపురం ఎంఎల్‌ఏ బొమ్మిడి నాయకర్, సినిమాటోగ్రఫీ మంత్రి కందుల దుర్గేష్, భీమవరం ఎంఎల్‌ఏ పులపర్తి రామాంజనేయులు, ఉంగుటూరు ఎంఎల్‌ఏ ధర్మరాజు పాల్గొన్నారు.

పెర్కిపాలెంలో ఫస్ట్‌ఎయిడ్ క్యాంపు

వీరవాసరం: వర్షాకాలం ప్రారంభం కావడంతో పెర్కిపాలెం గ్రామంలో మంగళవారం ఫస్ట్‌ఎయిడ్ క్యాంపు నిర్వహించారు. ఈ క్యాంపు సందర్భంగా పరిసరాలను పరిశుభ్రంగా ఉంచుకోవలసిన అవసరాన్ని ఆరోగ్య సిబ్బంది గ్రామస్తులకు అవగాహన కలిగించారు. సీజనల్ వ్యాధులపై సర్వే చేశారు. అంటు వ్యాధులు సోకకుండా తీసుకోవలసిన జాగ్రత్తలను ప్రజలకు వివరించారు. ప్రథమ చికిత్స కేంద్రాన్ని ఏర్పాటు చేసి అవసరమైన వారికి మందులు అందజేశారు. గ్రామంలో ఎటువంటి జ్వరాలు లేవని నిర్ధారించారు. ఈ కార్యక్రమంలో వైద్యులు పి.సత్యనారాయణరాజు, ఎ.దేవీరాణి, సిహెచ్‌ఓ పి.కృష్ణమూర్తి, చిట్టిబాబు, జగమని, భారతి, ఆశలు పాల్గొన్నారు.

ప్రతి ఎకరాకూ సాగునీరివ్వాలి : మంత్రి నిమ్మల

పాలకొల్లు : రాష్ట్రంలో వ్యవసాయానికి సంబంధించి ఖరీఫ్ సీజన్‌లో సాగునీటి ఇబ్బందులు తలెత్తకుండా పంట కాలువల శివారు ప్రతి ఎకరానికి నీరు అందేలా అధికారులంతా క్షేత్రస్థాయిలో దృష్టి పెట్టాలని రాష్ట్ర జల వనరుల శాఖ మంత్రి నిమ్మల రామానాయుడు తెలిపారు. ప్రస్తుత వర్షాకాలంలో ముంపు సమస్య ఎదురు కాకుండా, అన్నదాతకు మేలు జరిగేలా కాలువలు, డ్రెయిన్లలో అవసరమైన ప్రక్షాళన పనులను యుద్ధ ప్రాతిపదికన పది రోజుల్లో మొదలుపెట్టేల సమాయత్తం కావాలని వెలగపూడి సచివాలయంలో మంత్రి నిమ్మల రామానాయుడు ఆయన చాంబర్‌లో జలవనరుల శాఖ ప్రత్యేక ప్రధాన కార్యదర్శి జి.సాయి ప్రసాద్, సలహాదారులు ఎం.వెంకటేశ్వరరావుతో కలిసి శాఖ సంబంధించిన ఉన్నత ఇంజనీరింగ్ అధికారులు, అన్ని జిల్లాల ఎస్ఇ,ఈఈ లతో వీడియో కాన్ఫరెన్స్ నిర్వహించి సమీక్షించారు.

ఉరేసుకుని గుర్తు తెలియని వ్యక్తి ఆత్మహత్య

నరసాపురం: నరసాపురం మండలంలో గుర్తుతెలియని వ్యక్తి ఆత్మహత్య చేసుకుని మృతి చెందిన సంఘటన మంగళవారం చోటుచేసుకుంది. దీనికి సంబంధించి పోలీసులు తెలిపిన వివరాల ప్రకారం మండలంలోని లక్ష్మణేశ్వరం గ్రామంలో మంగళవారం చెత్త సంపద కేంద్రం వద్ద రేకు షెడ్‌కు ఉరి వేసుకుని చనిపోయినట్లు సమాచారం అందిందన్నారు. మృతుడు వయసు సుమారు 40-45ల మధ్య ఉంటుందన్నారు. మతుడు వివరాలు, మరణానికి గల కారణాలు తెలియాల్సి ఉందన్నారు. దీనిపై లక్ష్మణేశ్వరం విఆర్‌ఒ మేళం చిరంజీవి ఇచ్చిన ఫిర్యాదు మేరకు ఎఎస్‌ఐ కె.శ్రీనివాస్ కేసు నమోదు చేసి దర్యాప్తు చేసినట్లు తెలిపారు.

'ఇష్టంగా చదవండి.. భారంగా కాదు'

ప్రజాశక్తి - ఉండి

ప్రతి విద్యార్థి చదువును ఇష్టంతో చదవాలని భారంగా చదవద్దని, ఇష్టంతో చదివితే విద్యలో రాణించటం పెద్ద కష్టం కాదని పలువురు వక్తలు అన్నారు. ఉండి లయన్స్ క్లబ్ ఆధ్వర్యంలో మంగళవారం మండలంలోని చిలుకూరు, మహాదేవపట్నం గ్రామాలలో గల పలు పాఠశాల విద్యార్థులకు దాత ఎఎంసి మాజీ చైర్మన్ లయన్ సాగిరాజు సాంబశివరాజు ఆర్థిక సహాయంతో క్లబ్ అధ్యక్షురాలు వేగేశ్న అనంతలక్ష్మి ఆధ్వర్యంలో కంచాలు పంపిణీ కార్యక్రమం నిర్వహించారు. ఈ కార్యక్రమాలలో సత్తి బ్రహ్మారెడ్డి, భూపతిరాజు హరనాధ రాజు పాల్గొన్నారు.

వానొస్తే చిత్తడే..

పాఠశాల ప్రాంగణమంతా నీటిగుంటలు, బురదమయం

ప్రజాశక్తి - ఆకివీడు



వాన నీటితో నిండిన పాఠశాల ప్రాంగణం

చిన్న వాన వస్తే చాలు ఆ స్థలం అంతా నీటి గుంటగా మారిపోతుంది. విద్యార్థులు క్లాస్ రూమ్స్‌కి వెళ్లాలంటే నీటి గుంటల్లో నుంచి తడుచుకుంటూ వెళ్లాల్సిందే. కంగారుగా వెళితే బట్టలు తడిసిపోతాయి. జారిపడితే మొత్తం బురదమయం. చేయి జారితే పుస్తకాలు తడిసి ముద్దవుతాయి. ఇది స్థానిక సరోజినీ నాయుడు జిల్లా పరిషత్ బాలికల ఉన్నత పాఠశాల ప్రవేశ దారి పరిస్థితి. ఈ పాఠశాలలో సుమారు 350 మంది విద్యార్థినులు చదువుకుంటున్నారు. పాఠశాల ప్రహరీ గేటుకి ఉన్న ప్రధాన గేటు తీస్తే క్లాస్ రూమ్‌కి, ఉపాధ్యాయులు ఆఫీస్ రూమ్‌కి వెళ్లలేని పరిస్థితి. పాఠశాల ముందు కాంపౌండ్‌లో ఉన్న ఖాళీ స్థలం గుంటల మయంగా ఉంది. ఖాళీ స్థలం మొత్తం పల్లంగా ఉండడంతో చిన్న వాన వస్తే చాలు నీరు నిలబడి పోతుంది. మొన్నటి వరకు చాలా లోతుగా గొయ్యిగా ఉండేది. కొంతమేర పూడిక జరిగినా.. పూర్తిస్థాయిలో మాత్రం జరగలేదు. పాఠశాలలో మౌలిక సదుపాయాలు గతంలో కన్నా మెరుగైనప్పటికీ అసలు ప్రవేశద్వారం మధ్య సమస్య నెలకొంది. కాగా పాఠశాల విద్యార్థినులకు తరగతి గదులు చాలకపోవడంతో సుమారు నాలుగు సంవత్సరాల క్రితం నాబార్డ్ సహకారంతో ప్రారంభించిన అదనపు తరగతి గదుల నిర్మాణం పూర్తి కాలేదు. అయితే ఇటీవలే రకరకాల నిధులతోటి భవనం కింద గదులు పూర్తయ్యాయి. అక్కడే తరగతులు నిర్వహిస్తున్నారు. ఇక భవనం పైభాగంలో ఉన్న నాలుగు గదుల నిర్మాణం సగం పూర్తయి అభ్యంతరంగా నిలిచిపోయి ఉన్నాయి. కాగా విద్యార్థులకు అవసరమైన బల్లలు, కుర్చీలు పూర్తిస్థాయిలో లేవని విద్యార్థులు వాపోతున్నారు. ప్రభుత్వం చేపట్టిన మౌలిక సదుపాయాలు పూర్తిస్థాయిలో విద్యార్థులకు అందలేదు. వెంటనే పాఠశాల లోతట్టు ప్రాంతం పూడ్చి విద్యార్థులకు సమస్య లేకుండా చేయాలని తల్లిదండ్రులు కోరుతున్నారు.

కొవ్వలి ఫౌండేషన్ ఆధ్వర్యాన బాధితులకు నిత్యావసరాల పంపిణీ

ప్రజాశక్తి - నరసాపురం



నిత్యావసర సరుకులు పంపిణీ చేస్తున్న భాస్కర్ నాయుడు

వివిధ అనారోగ్యాలతో బాధపడుతున్న వ్యక్తులకు కొవ్వలి ఫౌండేషన్ ద్వారా ప్రతినెల ఉచితంగా నెలకు సరిపడా నిత్యవసర సరుకులను అందిస్తున్నారు. దీనిలో భాగంగా మంగళవారం ఫౌండేషన్ ఛైర్మన్ కొవ్వలి యతి రాజారామ్మోహన్ నాయుడు ఆదేశాల మేరకు ఆయన నివాసంలో నిత్యావసర సరుకులను సంకు భాస్కర్ నాయుడు అందించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ సుమారు రెండేళ్ల క్రితం కొవ్వలి ఫౌండేషన్ ఏర్పాటు చేసి ఎన్నో సేవా కార్యక్రమాలు చేస్తున్నామని అన్నారు. విద్య వైద్యానికి ఆర్థిక ఇబ్బందులు వల్ల బాధపడుతున్న వారిని గుర్తించి ప్రతి నెల వ్యాధుల బారి నుంచి కోలుకునేందుకు మందులు అందిస్తున్నామన్నారు. పేదరికం వల్ల చదువులు ఆగిపోకూడదనే ఉద్దేశంతో అందరూ చదువుకుంటేనే దేశం అభివృద్ధి అవుతుందనే నమ్మకంతో అనేకమంది విద్యార్థులకు సహకారం అందిస్తున్నామన్నారు. పెన్షన్ కూడా రాకుండా ఆర్థిక ఇబ్బందులతో బాధపడుతున్న వారికి ప్రతి నెల అవసరమైన నిత్యవసర సరుకులు ఇస్తున్నామన్నారు. నియోజకవర్గంలో కనీస అవసరాలకు కూడా ఇబ్బందులు పడే ఎంతో మందిని కొవ్వలి ఫౌండేషన్ ద్వారా తన చిన్ననాటి స్నేహితుడు కొవ్వలి ఫౌండేషన్ ఛైర్మన్, టిడిపి రాష్ట్ర కార్యనిర్వాహక కార్యదర్శి, కొవ్వలి యతిరాజ రామ్మోహన్ నాయుడు రాజకీయాలకతీతంగా, కులమతాలకు అతీతంగా చేస్తున్న సేవా కార్యక్రమాలను అభినందించారు. ఆయన నిండు నూరేళ్లు ఆయురారోగ్యాలతో ఉండాలని భాస్కర్ నాయుడు మనస్ఫూర్తిగా ఆకాంక్షించారు. ఈ కార్యక్రమంలో పలువురు ఫౌండేషన్ సభ్యులు, అభిమానులు పాల్గొన్నారు.

విద్యార్థులు పరిశుభ్రతపై అవగాహన కలిగి ఉండాలి

ఆరోగ్య సహాయకులు నామాలరాజు

ప్రజాశక్తి - గణపవరం

ఇంటి పరిసరాలను పరిశుభ్రంగా ఉంచుకొని, విద్యార్థులు పరిశుభ్రతపై అవగాహన కలిగి ఉండాలని కాశిపాడు ఆరోగ్య సహాయకులు నామాలరాజు అన్నారు. మలేరియా వ్యతిరేక మాసోత్సవం సందర్భంగా మంగళవారం కాశిపాడు ఎంపిపి నెంబర్-2 పాఠశాల విద్యార్థులకు పరిశుభ్రతపై అవగాహన కల్పించారు. ఈ కార్యక్రమంలో పాల్గొన్న కాశిపాడు ఆరోగ్య సహాయకులు నామాలరాజు మాట్లాడుతూ ఇంటి చుట్టు పక్కల మురికి నీరు ఉండకుండా జాగ్రత్తలు తీసుకొని పనికిరాని వస్తువులు ఇంటికి దూరంగా ఉంచాలని అన్నారు. పనికిరాని వస్తువులు ఇంటి వద్ద ఉంచడం వల్ల దోమలు పెరిగి అవి కాటు వేయడంతో మలేరియా, డెంగీ వ్యాధులు వస్తాయని తెలిపారు. ఈ కార్యక్రమంలో స్కూలు హెచ్‌ఎం.వెంకటేశ్వర్లు, టివిఎస్ రంగనాయకులు ప్రసాద్, ఎఎన్‌ఎం వి.శివకుమారి, ఆశా కార్యకర్తలు వరలక్ష్మి, కృష్ణకుమారి పాల్గొన్నారు.

పేద ప్రజలకు నాణ్యమైన విద్య అందించడమే లక్ష్యం

జనసేన యువనేత బొలిశెట్టి రాజేష్

ప్రజాశక్తి - తాడేపల్లిగూడెం

పేద ప్రజలందరికీ కార్పొరేట్ స్థాయి విద్య అందించడమే కూటమి ప్రభుత్వ లక్ష్యమని జనసేన యువ నాయకులు బొలిశెట్టి రాజేష్ తెలిపారు. తాడేపల్లిగూడెం పట్టణంలోని 15వ వార్డు ఎంకె ఎలిమెంటరీ స్కూల్‌లో మంగళవారం ప్రధానోపాధ్యాయులు మహమ్మద్ అమిరుద్దీన్ అధ్యక్షతన విద్యార్థులకు స్టూడెంట్స్ కిట్లను ఆయన అందించారు. ఈ సందర్భంగా బొలిశెట్టి రాజేష్ మాట్లాడుతూ తాము కూడా విద్యా సంస్థ నిర్వహిస్తున్నామని, ఆ విద్యాసంస్థలో పేదలకు, మధ్యతరగతి వారికి దగ్గరగా ఫీజులు ఉండే విధంగా చర్యలు తీసుకుంటున్నామన్నారు. ఈ కార్యక్రమంలో జనసేన వార్డు ఇన్‌ఛార్జి అడబాల రామారావు, పత్యాల ఎంకన్న, దూద్ భాష, పజ్జూరి శ్రీను, సమయం ప్రసాద్, పెంటపాడు మండల అధ్యక్షుడు పుల్ల బాబి, వేముల శ్రీను, గారపాటి వేణు, అయినం నాగసాయి, వీరమల్ల శ్రీను, యాకోబు యెహెూవా రాము, పల్లెల వినయ్ పాల్గొన్నారు.

ఎంఎల్‌ఎ మార్కెట్ యార్డ్ ఆకస్మిక తనిఖీ

ప్రజాశక్తి - నరసాపురం

నరసాపురం మార్కెట్ యార్డ్‌ను మంగళవారం ఉదయం ఎంఎల్‌ఎ బొమ్మిడి నాయకర్ ఆకస్మికంగా తనిఖీ చేశారు. ఎఎంసి మార్కెట్ ఆఫీస్, ధాన్యం గోడౌన్‌లను పరిశీలించి అధికారులతో పలు విషయాలను చర్చించారు. ఆక్వా ఎక్స్‌పోర్ట్ లారీల నుంచి వసూలు చేసే పన్ను తగ్గటంపై నాయకర్ అధికారుల నుంచి ఆరా తీశారు. యాడాది రూ.మూడు కోట్ల పైబడి పన్ను వసూలు చేసేలా చర్యలు తీసుకోవాలని అధికారులకు సూచించారు. రైతు బజార్లలో రైతులే అమ్మకాలు జరిపేలా చూడాలంటూ ఆదేశించారు. మార్కెట్ యాడ్‌లో ఉన్న గెస్ట్ హౌస్‌ను ఆధునికీకరించాలని తెలిపారు.

ఫిట్స్‌తో విద్యార్థిని మృతి

ప్రజాశక్తి - పోడూరు



పాఠశాల విద్యార్థిని పిట్స్‌తో బాధపడుతూ అపస్మారక స్థితిలో చికిత్స పొందుతూ సోమవారం రాత్రి మృతి చెందిన ఘటన మండల కేంద్రం అయిన పోడూరు కల్నల్ డిఎస్.రాజు జెడ్‌పి ఉన్నత పాఠశాలలో ఆలస్యంగా వెలుగు చూసింది. పాఠశాల హెచ్‌ఎం ఐ.జనార్ధన్ రాజు, విద్యార్థిని బంధువులు తెలిపిన కథనం ప్రకారం స్థానిక పాఠశాలలో తొమ్మిదో తరగతి చదువుతున్న చెల్లబోయిన అనుషా గోపిక నందిని(14) యధావిధిగా సోమవారం పాఠశాలకు వెళ్లింది. మధ్యాహ్నం భోజన విరామంలో భోజనం చేసిన తర్వాత తరగతి గదిలోకి వెళ్తుండగా పిట్స్ రావడంతో నందిని అపస్మారక స్థితిలోకి వెళ్లిపోయింది. తోటి విద్యార్థినులు ఉపాధ్యాయులతో చెప్పడంతో నందినిని ఆఫీస్ గదిలో సపర్యలు చేస్తూ విద్యార్థిని తాతయ్య కన్నిబోయిన భాస్కరరావుకు సమాచారం అందించారు. తాతయ్య సహాయంతో ఆటోలో స్థానిక పిహెచ్‌సికి తరలించారు. ప్రాథమిక వైద్యం అందించి మెరుగైన వైద్యం నిమిత్తం పాలకొల్లు ప్రభుత్వ ఆస్పత్రికి 108 వాహనంలో తరలించగా వైద్యులు పరీక్షించి అప్పటికే ఆమె మృతి చెందినట్లు నిర్ధారించారు. శ్రీనివాసరావు, లక్ష్మీలకు ఇద్దరు కుమర్తెలు. నందిని తండ్రి శ్రీనివాసరావు మూడేళ్ల క్రితం కోవిడ్‌తో మృతి చెందాడు. భర్త మరణంతో లక్ష్మి అత్తవారి ఇళ్లు వెడంగి నుంచి పుట్టినిల్లు పోడూరు పిల్లలతో వచ్చేసింది. జీవనోపాధి నిమిత్తం పిల్లలని తల్లితండ్రులకు అప్పగించి గల్ఫ్ వెళ్లింది. చలాకీగా ఉండే నందిని కళ్ల ముందే మృతి చెందడంతో గ్రామం, పాఠశాలలో విషాద ఛాయలు అలుముకున్నాయి.

విత్తన శుద్ధి, నారుమడిపై రైతులకు అవగాహన

ప్రజాశక్తి - పెనుమంట్ర

ప్రస్తుతం సార్వా వరి పంటకోసం నారుమడులు సిద్ధం చేసుకొనే ఏర్పాట్లులో ఉన్న రైతులకు విత్తన శుద్ధి, నారుమడి పెంపకం గురించి వ్యవసాయ అధికారులు సూచనలు చేశారు. విత్తే ముందు తప్పనిసరిగా విత్తనాలు శుద్ధి చేసుకోవాలని ఇలా చేయడం వల్ల మంచి నారుని పొందవచ్చని అన్నారు. ఒక కిలో విత్తనాలకు 25 శాతం కార్బోనైజేషన్, 50 శాతం మాంకోజెబ్ మిశ్రమానికి రెండు గ్రాముల శిలీంద్ర నాశినితో లీటరు నీటితో కలిపి శుద్ధి చేయాలన్నారు. ఇదే పొడి విత్తనశుద్ధి కోసం అయితే పై శిలీంద్ర నాశిని ద్రవాన్ని కిలో విత్తనాలకు నాలుగు గ్రాముల చొప్పున వాడాలని తెలిపారు.

నారుమడి యాజమాన్యం : ముఖ్యంగా నారుమడిని 10 నుంచి 12 రోజుల వ్యవధిలో మూడు దఫాలు దమ్ము చేసి, చదును చేయాలని సూచించారు. ఐదు సెంట్లలో నారుమడికి రెండు కిలోల నత్రజనిని పొలంలో విత్తనం చల్లే ముందు వినియోగించాలన్నారు. పొలంలో జింకు లోపం వుంటే రెండు గ్రాముల జింక్ సల్ఫేట్ ఒక లీటరు నీటిలో కలిపి పిచికారీ చేయాలని సూచించారు. మోనోక్రోటోఫాస్ 1.6 మిల్లీ లీటర్లు లేదా రెండు మిల్లీ లీటర్లు క్లోరి పైరిఫాస్ ఒక లీటరు నీటితో కలిపి విత్తిన 10 నుంచి 17 రోజుల్లో పిచికారీ చేయాలన్నారు. నారు తీయడానికి ఏడు రోజులు ముందు సెంటు నారుమడికి 160 గ్రాముల కార్బన్ డైజ్ గుళికలు వేసి పలుచగా నీరు పెట్టాలని సూచించారు.

టిడిపి కూటమితోనే గ్రామాలాభివృద్ధి

సర్పంచి సోమేశ్వరరావు

ప్రజాశక్తి - కాళ్ల



కల్వర్టు నిర్మాణ పనులను పరిశీలిస్తున్న సర్పంచి సోమేశ్వరరావు

టిడిపి కూటమితోనే గ్రామాలాభివృద్ధి సాధ్యమని పెదఅమిరం గ్రామ సర్పంచి డొక్కు సోమేశ్వరరావు అన్నారు. నెహ్రూ పేటకు వెళ్లే రహదారిలో కల్వర్టు నిర్మాణ పనులను గ్రామ సర్పంచి డొక్కు సోమేశ్వరరావు మంగళవారం పరిశీలించారు. ఈ సందర్భంగా సర్పంచి డొక్కు సోమేశ్వరరావు మాట్లాడుతూ గ్రామంలో తాగునీటి సమస్య తలెత్తకుండా మంచినీటి చెరువును పూర్తిస్థాయిలో నింపుతున్నామన్నారు. పల్లాలమ్మ గుడికి వెళ్లే రహదారి విస్తరణ పనులు చేపడుతున్నామని తెలిపారు. 10 అడుగుల వెడల్పు ఉండేలా రహదారిని, 16 అడుగుల వెడల్పుతో సిమెంట్ రోడ్డు పనులను రూ.10 లక్షలతో నిర్మిస్తున్నామన్నారు. ప్రతి రోడ్డుకి ఇరువైపులా చెత్తా, మట్టి తొలగించే పనులు చేస్తున్నామన్నారు. నెహ్రూ పేటకు వెళ్లే రహదారిలో కల్వర్టు నిర్మాణ పనులను పంచాయతీ నిధులు రూ.2.50 లక్షలతో చేపడుతున్నామన్నారు. వైద్య సబ్ సెంటర్‌కు వెళ్లే రహదారి పనులు రూ.2.50 లక్షలతో సిమెంట్ రోడ్డు నిర్మాణ పనులు చేపట్టామన్నారు. ఉండి ఎంఎల్‌ఎ కనుమూరు రఘురామకృష్ణంరాజు సహకారంతో పెదఅమిరం గ్రామాభివృద్ధి పనులు చేపడతామని తెలిపారు.

అంబేద్కర్ పేరు పునరుద్ధరణపై హర్షం

నరసాపురం: ప్రభుత్వం ఏర్పడిన కొద్ది రోజుల్లోనే సిఎం నారా చంద్రబాబు నాయుడు యధావిధిగా డాక్టర్ బిఆర్ అంబేద్కర్ విదేశీ విద్యగా పేరు పునరుద్ధరించడం సంతోషించదగ్గ విషయమని ఎంఆర్‌పిఎస్ఎస్ రాష్ట్ర ప్రధాన కార్యదర్శి, జనసేన నాయకులు తెన్నేటి సురేష్ హర్షం వ్యక్తం చేశారు. మంగళవారం జనసేన కార్యాలయంలో ఆయన మాట్లాడుతూ దళిత బడుగు, బలహీన వర్గాలకు చెందిన వారు పెద్ద చదువులు చదవాలనే ఉద్దేశంతో కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు డాక్టర్ బిఆర్ అంబేద్కర్ విదేశీ విద్య పథకం పెట్టి కోట్ల రూపాయలు వెచ్చించారన్నారు. పథకం ద్వారా లబ్ధి చేకూర్చుతూ ఎంతో కాలంగా కొనసాగుతున్న పేరును మాజీ సిఎం జగన్ మోహన్ రెడ్డి జగనన్న విదేశీ విద్యగా పేరు మార్చి, నిధులు దారి మళ్లించి యావత్తు దళిత జాతి ఆత్మ గౌరవాన్ని దెబ్బతీశారని ధ్వజమెత్తారు. పేరు మార్పు తగదని మా గొంతు వినిపించినా పట్టించుకున్న పాపాన పోలేదన్నారు. జగనన్న విదేశీ విద్యగా పేరు మార్చుకుని డాక్టర్ బిఆర్ అంబేద్కర్ గౌరవానికి భంగం కలిగించిన జగన్మోహన్ రెడ్డి చరిత్ర హీనుడిగా నిలిచారని విమర్శించారు. విదేశీ విద్యపేరు పునరుద్ధరించడంతో రాష్ట్ర వ్యాప్తంగా దళితులంతా సంతోషం వ్యక్తం చేస్తున్నారని తెలిపారు.

విద్యార్థులు మత్తు పదార్థాలకు దూరంగా ఉండాలి

ఎన్‌సిసి కమాండింగ్ ఆఫీసర్ సి.రోహిత్ కుమార్

నరసాపురం: మత్తు పదార్థాలకు బానిసలై విద్యార్థులు జీవితాన్ని నాశనం చేసుకోవద్దని ఎన్‌సిసి కమాండింగ్ ఆఫీసర్ సి.రోహిత్ కుమార్ అన్నారు. మంగళవారం నరసాపురం పట్టణంలో అంతర్జాతీయ మాదకద్రవ్యాల దినోత్సవం సందర్భంగా సెవెన్ ఆంధ్రా నావెల్ యూనిట్ విద్యార్థులు ర్యాలీ నిర్వహించారు. ఈ సందర్భంగా కమాండింగ్ ఆఫీసర్ రోహిత్ కుమార్ మాట్లాడుతూ మాదకద్రవ్యాలు తీసుకోవడం వల్ల జరిగే అనర్థాలను విద్యార్థులకు వివరించారు. యువత దేశానికి పట్టుకొమ్మలని, వారు మంచి ఆలోచనలు కలిగి ఉండాలని, సమాజాభివృద్ధికి తద్వారా దేశ అభివృద్ధికి తోడ్పడాలని విద్యార్థులకు సూచించారు. ఒక వ్యక్తి డ్రగ్స్‌కి అలవాటు పడితే మాన్పించడం చాలా కష్టమని, డ్రగ్స్ వినియోగం వల్ల ఆ వ్యక్తి ఏం చేస్తాడో తనకే తెలియదని, మత్తులో నిద్రిస్తాడని, క్రూరమైన ఆలోచనలు కలిగి ఉంటాడని తెలియజేశారు. విద్యార్థులు తమ పరిసర ప్రాంతాల్లో ఎవరైనా డ్రగ్స్ వినియోగిస్తున్నట్టు అనుమానం వచ్చినా, విక్రయిస్తున్నట్టు తెలిసిన పోలీసులకు సమాచారం అందివాలని అప్పుడు మాత్రమే డ్రగ్స్ రహిత సమాజం సాధ్యమవుతుందని తెలిపారు. విద్యార్థులు, సామాన్య ప్రజలు పోలీసు వారికి తమ వంతు సహాయ, సహకారాలు అందించాలని సూచించారు.

ఐటి శాఖ మంత్రి లోకేష్‌ను కలిసిన మంత్రి నిమ్మల

ప్రజాశక్తి - పాలకొల్లు

వెలగపూడి సచివాలయంలో రాష్ట్ర మానవవనరులు, ఐటీ, ఎలక్ట్రానిక్స్, ఆర్‌టిజి శాఖల మంత్రిగా నారా లోకేష్ బాధ్యతలు స్వీకరించిన సందర్భంగా ఆయనను రాష్ట్ర జలవనరుల శాఖ మంత్రి నిమ్మల రామానాయుడు కలిశారు. లోకేష్‌కు శాలువా కప్పి పుష్పగుచ్ఛాన్ని అందించి శుభాకాంక్షలు తెలిపారు. వారు ఇరువురు రాష్ట్రంలోని తాజా రాజకీయ పరిస్థితులపై చర్చించారు.

మంత్రి నాదెండ్ల మనోహర్‌ను కలిసిన నాయకర్

ప్రజాశక్తి - నరసాపురం

రాష్ట్ర పౌర సరఫరాలు, ఆహారం, వినియోగదారుల వ్యవహారాల మంత్రి నాదెండ్ల మనోహర్‌ను నరసాపురం జనసేన నాయకులు మంగళవారం అమరావతిలో కలిశారు. నరసాపురం ఎంఎల్‌ఎ బొమ్మిడి నాయకర్‌తో కలిసి వెళ్లి మంత్రి మనోహర్‌కు పుష్పగుచ్ఛం అందజేసి శుభాకాంక్షలు తెలియజేశారు.

28న మున్సిపల్ సాధారణ సమావేశం

నరసాపురం: మున్సిపల్ సాధారణ సమావేశం ఈనెల 28వ తేదీ శుక్రవారం మధ్యాహ్నం 3 గంటలకు నరసాపురం పురపాలక సంఘం కౌన్సిల్ హాల్‌లో నిర్వహిస్తున్నట్లు మున్సిపల్ ఛైర్మన్ బర్రె వెంకట రమణ తెలిపారు. కావున సభ్యులందరూ సకాలంలో హాజరు కావాలని కోరారు.

ముత్యాలమ్మ సన్నిధిలో మాజీ మంత్రి కొత్తపల్లి

మొగల్తూరు: మండలంలోని ముత్యాలపల్లి గ్రామంలో వేంచేసియున్న బండి ముత్యాలమ్మ అమ్మవారిని మంగళవారం మాజీ మంత్రి కొత్తపల్లి సుబ్బారాయుడు దర్శించుకున్నారు. అమ్మవారిని దర్శించుకుని ప్రత్యేక పూజలు చేశారు. ఆయన వెంట మాజీ సర్పంచి కర్రి వీరస్వామి ఉన్నారు.

పశువులకు గొంతువాపు నివారణ టీకాలు

మొగల్తూరు: మండలంలోని ముత్యాలపల్లి, వారతిప్ప గ్రామాల్లో రహదారిపై తిరుగుతున్న పశువులకు గొంతువాపు నివారణ టీకాలు పశు సంవర్ధక శాఖ సిబ్బంది వేశారు. మంగళవారం సాయంత్రం మొగల్తూరులోని రామకృష్ణ చారిటబుల్ ట్రస్ట్ ఆధ్వర్యంలో ఆయా గ్రామాల్లోని 102 పశువులకు గొంతువాపు నివారణ టీకాలు వేశారు. ట్రస్ట్ ఆధ్వర్యంలో గత 4 రోజులుగా గ్రామాల్లో ఉన్న పశువులకు నివారణా టీకాలు వేయిస్తున్నామని ట్రస్ట్ ఛైర్మన్ తణుకుల రామకృష్ణ తెలిపారు. ఈ కార్యక్రమంలో సభ్యులు ఎన్.నవీన్, కె.చిట్టి, ఎ.రామకృష్ణ ఉన్నారు.

శానిటేషన్ డ్రింకింగ్ వాటర్ కేంద్రాల పరిశీలన

పెనుగొండ: మండలంలో డయేరియా, అంటు వ్యాధుల నివారణా చర్యల్లో భాగంగా ఎంపిడిఒ శ్రీనివాస్ దొర మంగళవారం పెనుగొండ సిద్ధాంతం వడలి గ్రామాల్లోని మంచినీటి ట్యాంకులు, శానిటేషన్ డ్రింకింగ్ వాటర్ మొదలగు అంశాలను పరిశీలించారు. ఇఒ పంచాయతీ వెంకట్ రెడ్డి మండలంలోని గ్రామాలను సందర్శించారు. ఎంపిడిఒ స్వయంగా వడలి గ్రామములో వాటర్ ట్యాంకు పైభాగం నుంచి వాటర్ క్లోరినేషన్ లోపలి భాగమున శుభ్రపరిచిన అంశములను పరిశీలించి, తదుపరి చిన్న మల్లం గ్రామంలో శానిటేషన్ పనులను పరిశీలించారు. ఎంపిడిఒతో పాటు వివిధ శాఖల అధికారులు, పంచాయతీ కార్యదర్శులు పాల్గొన్నారు.

పాఠశాలల్లో జంతువుల పరిరక్షణపై పోటీలు

భీమవరం టౌన్: జంతువుల సంరక్షణ, పరిరక్షణ మానవత్వంతో కూడిన సామాజిక బాధ్యత అని జిల్లా పశు సంవర్ధక శాఖ డిప్యూటీ డైరెక్టర్ జాఫర్ హుస్సేన్, ఎడి సత్యనారాయణ మంగళవారం అన్నారు. జిల్లా జంతు సంక్షేమం, జిల్లా పశు సంవర్ధక శాఖల ఆధ్వర్యంలో నిర్వహిస్తున్న జంతు సంరక్షణ పరిరక్షణ పక్షోత్సవాల్లో భాగంగా భీమవరం సివి రామన్ స్కూల్, పిఎస్‌ఎం హైస్కూల్‌లో విద్యార్థులకు వ్యాస రచన, వక్తృత్వ పోటీలను నిర్వహించారు. గెలుపొందిన వారికి జూలై 6న జరిగే ముగింపు రోజున బహుమతులు, ప్రశంసా పత్రాలను అందజేస్తామని తెలిపారు.

'కక్షిదారులకు సమన్యాయం అందించండి'

నరసాపురం: ఈనెల 29వ తేదీన నరసాపురంలో అన్ని కోర్టుల సముదాయాలలో జరుగనున్న జాతీయ లోక్ అదాలత్ ద్వారా కక్షిదారులకు మరింత త్వరితగతిన సమ న్యాయం అందించడానికి న్యాయవాదులు తమ వంతు కృషి చేయవలసిందిగా నరసాపురం 10వ అదనపు జిల్లా న్యాయమూర్తి పి.విజయ దుర్గ కోరారు. మంగళవారం బార్ అసోసియేషన్ హాల్ నందు న్యాయవాదులతో ఏర్పాటు చేసిన సమావేశంలో తెలిపారు. గతంలో కంటే ఎక్కువ కేసులు రాజీ అయ్యేటట్లు న్యాయవాదులందరూ తమ వంతు కృషి చేయాలని తెలిపారు.

సీజనల్ వ్యాధులను అరికట్టాలి

భీమవరం టౌన్: పురపాలక సంఘం పరిధిలో అతిసార, సీజనల్ వ్యాధులను అరికట్టేందుకు ముందస్తు చర్యలు తీసుకోవాలని మున్సిపల్ కమిషనర్ ఎమ్.శ్యామల అన్నారు. మంగళవారం పురపాలక సంఘ కార్యాలయ కౌన్సిల్ హాల్‌లో అసిస్టెంట్ కమీషనర్, మున్సిపల్ ప్రజారోగ్య, ఇంజనీరింగ్ సిబ్బంది, సచివాలయ సిబ్బందికి సమీక్షించారు. ఈ సందర్భంగా పురపాలక సంఘ కమీషనర్ ఎమ్.శ్యామల మాట్లాడుతూ ఒహెచ్‌ఎస్‌ఆర్ ట్యాంకులను క్రమం తప్పకుండా 15 రోజులకు ఒకసారి శుభ్రం చేయించి ఏమినిటీస్ సెక్రటరీ ధ్రువీకరణ పత్రాన్ని ఎఇకి అందజేయాలన్నారు. జూలై 1 నుంచి ఆగస్టు 31 వరకు 'స్టాప్ డయేరియా కాంపెయిన్' నినాదంతో ప్రచార కార్యక్రమాన్ని నిర్వహించాలన్నారు.

పాస్‌పోర్టు పోయినది

పశ్చిమ గోదావరి జిల్లా, తాడేపల్లిగూడెం మండలం, మోదుగ గుంట గ్రామ కాపురస్తులము డోర్‌నెం.1-12/5 దిర్చిపోం స్వరూపారాణి, W/o.నరసింహమూర్తి అను నేను మోదుగగుంట గ్రామం నుండి తాడేపల్లిగూడెం జిరాక్స్ షాపుకు బైక్ మీద వెళుతుండగా నా యొక్క పాస్‌పోర్టు వున్న క్యారీ బ్యాగ్ జారీ పడిపోయినది.

పాస్‌పోర్టు నెంబర్. S.3809442 దయవుంచి దొరికినవారు నాకు తెలియపర్చగలరు.

సెల్: 7671812872

పాస్‌పోర్టు పోయినది

రాయి చినబాబు తండ్రి : వెంకట్రావు అను నేను నా యొక్క పాస్‌పోర్టు పడిపోయినది. అయితంపూడి నుండి తణుకు వెళుతుండగా మార్గమధ్యంలో నా యొక్క పాస్‌పోర్టు పడి పోయింది. నా యొక్క పాస్‌పోర్టు నెంబర్ : L6947080 గల పాస్‌పోర్టు ఎవరికైనా దొరికిన యెడల ఈ క్రింది అడ్రస్‌కు తెలియజేయగలరు.

రాయి చినబాబు, తండ్రి : వెంకట్రావు
డోర్ నెంబర్ : 3 - 39
అయితంపూడి , ఏలేటిపాడు, ఇరగవరం మండలం, ప.గో.జిల్లా. పిన్ : 534320
సెల్ : 7993426999